


ప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త
నోబెల్ బహుమతి విజేత
సి.వి. రామన్

* జననం: 7-11-1888 తిరుచిరపల్లి వద్ద
* 1903: మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో విద్యాభ్యాసం ఫిజిక్స్‌లో ఎం.ఎ.
* 1906: 'ఫిలసాఫికల్ మేగజైన్ ఆఫ్ లండన్' పత్రికలో వ్యాసం
* 1906-10: ఇండియన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్స్‌లో ఆఫీసర్
* 1911: కలకత్తాలోని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్ (ఐ.ఎ.సి.ఎస్.) సంస్థలో పరిశోధనలు ప్రారంభం
* 1917: కలకత్తా యూనివర్సిటీలో ఫిజిక్స్ శాఖకి అధిపత్యం (పాలిత్ ఛెయిర్)
* 1919: ఐ.ఎ.సి.ఎస్. సంస్థ కార్యదర్శిగా ఎన్నిక
* 1921: లండన్ పర్యటన. సముద్రం నీటి నీలి రంగుపై కీలక పరిశోధన
* 1928: రామన్ ఎఫెక్ట్ ఆవిష్కారం
* 1930: నోబెల్ పురస్కారం
* 1937: బెంగుళూరు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సంస్థలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా నియామకం.
* 1949: బెంగుళూరులోనే రామన్ రిసెర్చి సంస్థ స్థాపన. ఆమరణాంతం అక్కడే పూలపై, కాంతిపై, వజ్రాలపై పరిశోధనలు.
* నిర్యాణం: 21-11-1970.

శత జయంతి అక్షరాంజలి

ఎంత కాంతిని కుమ్మరిస్తున్నా చీకటి తప్పడంలేదని, సూర్యుడు కురకురలాడుతున్నాడు
కొండాపురం కొండపై
తిరుణాళ్ళ కోలాహలం చూసి.
అక్కడంతా భక్తుల వెర్రి పారవశ్యం!
అదంతా యువతీ యువకుల రక్తి సామ్రాజ్యం!!

# అర్థసత్యం



జనం గంగ వెర్రులెత్తి అరుస్తూ కొండ యెక్కుతున్నారు. పాత మొక్కులు తీర్చుకునేవారు, కొత్త మొక్కులు పెట్టుకొనే వారు. వాయిదా కానుకలు అమ్మవారికి అర్పించి 'హమ్మయ్య' అనుకొనేవారు.

మొక్కుబడితత్త్వం ముదిరిపోయి
మూఢత్వం మర్రి వూడలు దించిన చోటది

ఆపన్నులూ, ఆవేశపరులూ, సామాన్యులూ, అసామాన్యులూ అక్కడ గుమిగూడే సమయం అది.

"అమ్మో! పోలేరమ్మో! మాతల్లో! మా యిళ్ళ ఆడపడచువై, మా గడపల పసుపు కుంకానివై, మా వూరి యిలవేలుపువై, మా పంటల ప్రాణానివై, మా పశువుల ఆరోగ్య దేవతవై కాపాడు మా తల్లీ! మాయమ్మో!"

"మా తల్లి పోలేరమ్మో!"

అని భక్తులు 'కోరస్'గా చేస్తున్న నినాదాలు కొండమెట్లు సాగి, శిఖరాన్ని తాకి, గుడి గోపురాన్ని

పురాణపండ రంగనాథ్

పరామర్శించి అలా అలా గాలిలో అలలై వినిపించకుండా పోతున్నాయి.

విబూది ఒళ్ళవారు, అర్ధనగ్న దేహాలు, జడలు కట్టిన జుట్టువారు, గారడీల వారు, గణాచారులు— ఎందరో జడదారులు ఆ కొండదారుల వెంట వీరావేశంతో నడుస్తున్నారు. అమ్మవారి పేర్లని బిగ్గరగా అరుస్తున్నారు.

"కాత్యాయనీ! కామితార్థ ప్రదాయినీ! కాంచన వల్లీ! కల్పవల్లీ! కాదంబరీ! కదంబ వనేచారిణీ! వామాక్షీ! వామాచార పరాయణీ!"

అని ఆ జడదారులు అమ్మవారిని ఆర్తిగా పిలుస్తున్నారు. ఆ పిలుపులో ఒక లయ వుంది. ఒక శ్రుతి వుంది.

అంతమంది మధ్యా సమీర్, సూరజ్‌లు మాత్రం గంభీర మౌన ముద్రలతో నడుస్తున్నారు. అన్ని వేల మంది మధ్యా వారు ఏకాకులు. అంతటి రణగుణ ధ్వని మధ్యా వారిద్దరూ అంతర్ముఖులు.

వారి చేతులలో పూజా ద్రవ్యాలు లేవు. వైజ్ఞానిక ఉప కరణాలున్నాయి. వారి దగ్గర మొక్కుబడి దినుసులు లేవు. శాస్త్రీయ పరికరాలున్నాయి.

వారిలో భక్తి భావం లేదు
సత్యశోధనాసక్తి రాశీభూతం అయి వుంది.
వారి అడుగులు
మూఢత్వం గుండెలపై
హేతువాదం సమ్మెట దెబ్బలు!
వారి చూపులు
అజ్ఞానం చీకటి యెదని
చీల్చే విజ్ఞానం కాంతి కిరణాలు!

అరుదైన ఆ యువ శాస్త్రవేత్తల్ని చూసి, మురిసిన సూర్యుడు మబ్బు చాటు నుంచి బయటికి వచ్చి ఒక్కసారి తళుక్కున మెరిశాడు. అంతలోనే పలచటి కారుమేఘపు తునక ఆ కాంతి బింబాన్ని కప్పేసింది— నిజానికి పట్టిన అబద్ధపు మకిలిలా.

"ఈ సంవత్సరం అయినా మన ఈ ప్రయోగ యాత్ర ఫలిస్తుందంటావా?" సూరజ్‌ని సమీర్ అడిగాడు.

"సమీర్! వందల యేళ్ళుగా ఇక్కడ ఈ తిరునాళ్ళ జరుగుతోంది. కనీసం నలభై సంవత్సరాలుగా గణాచారులు ఇక్కడి మండపంలో ఈ అద్భుతాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ విచిత్రం గురించి తెలుసుకుందామని నిరుడు వచ్చాం. కాని ఆ వింత జరగలేదు. ఈసారేం జరుగుతుందో చూద్దాం"— సూరజ్ తన స్నేహితుడి ఆత్రాన్ని సమస్థితికి తెస్తూ ఊరడించాడు.

ఇది భలే వింత! ఆధునిక జీవ రసాయన శాస్త్రం కాని, నవీన భౌతిక విజ్ఞాన శాస్త్రం కాని ఇలాంటి ప్రక్రియ గురించి ఎలాంటి నిర్వచనం చేయలేదు.

ఈ కథలో 'కొండాపురం' అనంతమైన 'విశ్వ రహస్యాని'కి సంకేతం.
కొండ మీది అమ్మవారు, తిరునాళ్ళ మనిషి నమ్మకానికి, అన్వేషణకి, అజ్ఞాన విజ్ఞానాల మధ్య అతని మోకరింపుకి చిహ్నం.
అయినా ఇది నిజం.
తెలీక నమ్మేది విశ్వాసం
తెలిసి నమ్మేది విజ్ఞానం

అలాంటి ఒక అద్భుతం గురించి మనం ఈ ప్రయోగం చేయబోతున్నాం"— సమీర్ మాటలలో ఒక ఘన కార్యాన్ని చేయబోతున్నామన్న గర్వోద్ధతి, దీక్షాగరిమ ప్రతిధ్వనించాయి.

భక్తకోటి, శతకోటి కోరికలతో కొండ ఎక్కుతున్నారు. సమీర్, సూరజ్‌లు మాత్రం ఒక్క సత్య సాక్షాత్కారం కోసం ఆ కొండ మెట్లు అధిరోహిస్తున్నారు.

* * * *

కొండాపురం కొండ చాలా పురాతనమైనది. ఆ కొండపై చాలా ఏళ్ళ క్రితం పోలేరమ్మగుడి వెలిసింది. అదొక కథ. అదే ఆ క్షేత్రపు స్థల పురాణం.

ఎక్కడి నుంచి వచ్చాడో తెలీదు కాని ఒకనాడు అక్కడికి ఒక యువ సాధువు వచ్చాడు. కొండ మీద మకాం పెట్టాడు. అతడికి మూలికా వైద్యం, భూత వైద్యం బాగా తెలుసని చుట్టుపక్కల ప్రజలు చెప్పుకొనేవారు. సాధువు అలాంటి వైద్యాలు చేసి పేరుతెచ్చుకొన్నాడు. ఒక రాతితో పోలేరమ్మ బొమ్మని చెక్కి అక్కడ ప్రతిష్ఠించాడు. కాల క్రమంలో అతనికి భక్తుల సంఖ్య పెరిగింది. ఓ కొండ పిల్ల అతని వలలో పడింది. ఇది కిట్టనివాళ్ళు, అతని పలుకుబడిని సహించలేని వాళ్ళు మాటు వేసి ఆ యిద్దర్నీ చంపేశారు. సాధువు భక్తులు మాత్రం అతని నెత్తురుని రెండు ప్రత్తి పింజలలోకి యింకించి, రెండు సీసాలలో పెట్టి సీళ్ళు వేశారు. వాటిని అతని స్మృతి చిహ్నంగా పోలేరమ్మ గుడిలో వుంచి కొలిచేవారు. అప్పటి ఆ మూఢాచారం ఇప్పటికీ కొనసాగి వస్తోంది.

సాధువుని చంపేసిన రోజునే పోలేరమ్మ జాతరని కూడా జరపసాగారు. ఇలా చాలా ఏళ్ళు గడిచింది. ఒక ఏడాది తిరుణాళ్ళసమయంలో ఒకవింత జరిగింది. ఆ సీసాలలో గడ్డ కట్టిన రక్తం చెమ్మగా కరిగింది. సన్నగా పొగలు వెదజల్లింది. మరుక్షణంలో మరల గడ్డ కట్టేసింది. ఇది ఒక ఏడు కాదు, కొన్ని యేళ్ళుగా జరుగుతోంది. ఆ సాధువు మహోత్మ్యంగా ప్రజలు ఈ వింత ప్రక్రియని భావించి మరీ భక్తి పెంచుకున్నారు. బాగా ప్రచారం జరిగింది. తిరుణాళ్ళకి గిరాకీ పెరిగింది. పోలేరమ్మకి ఆదాయం అభివృద్ధి అయింది.

ఏ సంవత్సరం అయినా ఆ నెత్తుటి గడ్డలు కరిగి ఆవిర్లు రాకపోతే అపశకునంగా భావించి, భక్తులు మొక్కుల జాబితాలు పెంచేసేవారు. క్రిందటి ఏడాది అలా రక్తం ద్రవించలేదు. అందుకే కరవు పెరిగిందని భక్తులు భయపడి ఈ ఏడాది తిరునాళ్ళని బ్రహ్మాండంగా చేస్తున్నారు. లెక్కకు మిక్కిలిగా మొక్కులతో భక్తజనం తండోపతండాలుగా వస్తున్నారు.

* * * *

మరణించినవారి రక్తాన్ని భద్రపరచడం వింత యేమీ కాదు. అసాధ్యం యేమీ కాదు. అలా భద్రపరచగల రసాయన ప్రక్రియల్ని మనిషి చాలా యేళ్ళనాడే నేర్చుకున్నాడు. వింతల్లా గడ్డ కట్టిన రక్తం ప్రతీ యేడాదీ ఒకే రోజున, ఒకే టైమ్‌లో కొంతసేపు చెమ్మగిల్లి, సన్నటి పొగని ప్రసరించి, మరల గడ్డ కట్టడం. ఇలా నలభై ఏళ్ళుగా జరగడం. ఇదే విడ్డూరాతి విడ్డూరం.

"ఇది అసంభవం, ఇదేదో మూఢత్వం" అన్నారు హేతువాదులు.

"అశాస్త్రీయం"— అన్నారు శాస్త్రవేత్తలు.

"ప్రజల మౌఢ్యాన్ని మనం మార్చలేం"— అని కొందరు పెదవి విరిచారు తప్ప యెవ్వరూ శాస్త్రీయ విశ్లేషణకి పూనుకోలేదు. కాని కొన్ని అపరిపక్వమైన అభిప్రాయాలు వ్యక్తం అయాయి.

"ఆ సీసాల్ని పట్టుకొన్న వారి చేతి వేడికి ఆ రక్తం చెమ్మగిల్లుతోందని"— కొందరు మిడి మిడి జ్ఞానులు అన్నారు. కాని ఆ సీసాల్ని ఎవ్వరూ పట్టుకోరు, ముట్టుకోరు. ఇంజక్షన్ వయల్స్‌లా వుండే ఆ సీసాల్ని రెండు వెండి కర్రలకి అతికారు. ఆ చిన్న వెండి దండాలని గాజు పేటికలో అలంకరించారు. ఆ పేటిక చుట్టూ పట్టు తెరలుంటాయి. తిరుణాళ్ళ రోజున ఆ పేటికని గుడి మండపంలోనికి తెస్తారు. ఇన్ని కట్టుదిట్టాలున్న ఆ గాజు సీసాల్ని యెవ్వరూ తాకే అవకాశం వుండదు.

అంచేత ఆ వయల్స్‌ని బద్దలు కొట్టి పరిశీలిస్తే తప్ప ఈ రహస్యం బయటపడదని హేతువాదులు వాదించారు. వాదించడమే కాదు అలాంటిప్రయత్నం కూడా చేశారు.

కాని ఆలయం భక్తుల నుంచి ప్రతిఘటన యెదురయింది. అంతేకాదు, యెన్నో సంవత్సరాల చరిత్ర వున్న ఆ 'రక్తం వింత'ని అలా వదిలపరచడం

**అభిమానం**

మీకు 'సంగీత సామ్రాట్' అనే బిరుదు ఎలా వచ్చిందండీ అని ప్రశ్నించాడు పత్రికా విలేకరి సంగీత విద్వాంసుడు సదాశివశాస్త్రిని.

ఓహో... అదా... నేను అద్దెకున్న ఇల్లు ఖాళీ చేసినందుకుగాను ఆ చుట్టుపక్కల వారంతా కలసి నన్ను సత్కరించి ఈ బిరుదిచ్చారు.

—చెన్నాప్రగడ, విజయవాడ

మంచిదని, ఏనాటికైనా ఆధునిక సాంకేతిక పరికరాలతో ఆ రహస్యాన్ని ఛేదించవచ్చునని విజ్ఞులు పట్టుబట్టారు. దానితో ఆ వివాదం ముగిసింది. ఇది జరిగి చాలా యేళ్ళయింది.

* * * *

నాటికి నేడు మరల యివాళ అలాంటి ప్రయత్నం ఒకటి జరగబోతోంది. సమీర్, సూరజ్ అనే యువ శాస్త్రవేత్తలు ప్రపంచంలో ఇలాంటి అద్భుతాలపై పరిశోధనలు చేస్తూ ఇప్పుడు ఈ 'రక్తం వింత' అంతు చూడాలని తగిన సరంజామాతో వచ్చారు.

అటు భక్తులు, ఇటు జ్ఞానాసక్తులుతో కొండాపురం కొండమీది పోలేరమ్మ అమ్మవారి గుడి మండపం కిటకిటలాడుతోంది.

మండపం మధ్యగా యెత్తైన వేదికపై గాజుపెట్టె వుంది. దానికి కాషాయరంగు తెరలున్నాయి. అటు యిటు ఇద్దరు గణాచారులున్నారు. జిడ్డోడుతున్న కాషాయ వస్త్రాలు కట్టుకొన్న వారు కంచు ప్రతిమల్లా వున్నారు.

సరిగా నాలుగు గంటలకి ఆ తెరలు తొలగిస్తారు. అలా చూస్తుండగానే ఒక సెకను వ్యవధిలో ఆ పత్తి వుండలలో గడ్డ కట్టిన రక్తం చెమ్మగిల్లుతుంది. మరో సెకనులో రక్తం నుంచి సన్నటి పొగ చారలుగా లేస్తుంది. మరొక్క సెకనులో మరల గడ్డ కడుతుంది. అప్పుడు గణాచారులు తెరలు వేసేస్తారు. భక్తులు ఆ వేదిక చుట్టూ తిరిగి ప్రదక్షిణాలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇది మామూలుగా జరిగే తంతు.

ఈసారి మరొక యేర్పాటు చేశారు. ఆ నెత్తుటి వుండలు ద్రవించి, పొగలు ప్రసరించి, మరల ఘనీభవించే ప్రక్రియని ఈనాటి సాంకేతిక పరికరాలతో రికార్డ్ చేసే అవకాశం కల్పించారు.

సమీర్, సూరజ్ తమ తమ వైజ్ఞానిక ఉపకరణాలని అమర్చుకొన్నారు. అరుదైన ఆ ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారు.

"మామూలు నెత్తురు అయితే గాలి తగలగానే గడ్డ కడుతుంది. ముద్దగా అయిపోతుంది. మరల ద్రవించడం, గడ్డ కట్టడం వుండదు. ఇదంతా యేదో విచిత్ర రసాయనం అయి వుంటుంది" సూరజ్ అన్నాడు.

"అటు చూడు! గణాచారులు తెరలు తొలగిస్తున్నారు"- సమీర్ హెచ్చరించాడు.

### ప్రేమ

"నా భార్య నేను ఇంటికి వెళ్ళిందాకా భోంచేయదు" చెప్పాడు శ్రీను.

అబ్బ ఎంత పతిభక్తి" ఆశ్చర్యపోయాడు రాధాకృష్ణ.

"నా బొంద. ఆవిడకు నేనే వండిపెట్టాలి మరి" చెప్పాడు శ్రీను.

—పద్మశ్రీ (మాణిక్యారం)

ఇదంతా నిజమా! అబద్ధమా?
అంటే ఏదీ పూర్తి నిజం!
ఏది పూర్తి అబద్ధం!- అని తిరుగు
ప్రశ్న వస్తుంది
ఇది ఒక అనంతకాలపు
సదసత్సంశయం!
సైన్స్ స్పష్టం చేస్తున్న
అర్ధసత్యం!

"అంటే సరిగా నాలుగు గంటలైందన్నమాట..." అని సూరజ్ తన పరికరాల్ని సరిచూసుకున్నాడు.

భక్తులు మండపంలో తలలు పైకెత్తి ఆత్రంగా, కన్నార్పకుండా చూస్తున్నారు.

"జై పోలేరమ్మా! జైజై!! పోలేరమ్మా!" అని గణాచారి కేక పెట్టడంతో భక్తులు వెర్రి ఆనందంతో ఆ గాజు పెట్టె వైపు చూశారు. సూరజ్, సమీర్‌లు యంత్రాల్ని పని చేయించారు.

ఆ ముహూర్తం! అసాధారణం!

ఆ రసాయన చర్య! అనూహ్యం!

భక్తులు వూగిపోతున్నారు. వెర్రిగా చూస్తున్నారు.

వేనకు వేల సెంటీమీటర్ల పొడవైన ధమని శాఖలలో నాళికా పుంజాలలో, సిరలలో ప్రవహించిన ఒక మనిషి రక్తంలోని కొన్ని చుక్కలు యేనాడో గడ్డ కట్టి, ఈనాడు ద్రవించి, యేదో అనిర్వచనీయ జీవవేదనను వెలార్చుతున్నట్లు పొగని ప్రసరిస్తున్నాయి.

అదీ నిమేష కాలం. ప్రకృతి ధర్మాలు అనిమేషాలయిన క్షణం

గుడిలో గంటలు మ్రోగాయి. అమ్మవారి పాద సన్నిధానంలో హారతి వెలిగింది. భక్తులు పూనకం వచ్చినట్లు 'జై జై' ధ్వానాలు చేశారు.

అంతే! గణాచారులు ఆ గాజు పెట్టె తెరలు వేసేశారు. భక్తుల తోసుకుంటూ ప్రదక్షిణాలు ప్రారంభించారు. మొక్కులూ, ముడుపులూ చెల్లించుకొంటున్నారు.

సూరజ్, సమీర్‌లు పరికరాల్ని సర్దేసుకున్నారు.

* * * *

ఉరుముల ఆర్భాటంతో వూగిపోయిన ఆకాశం నిశ్శబ్దం అయినట్లు కొండాపురం నీరవం అయింది. మరల వచ్చే ఏడాది తిరునాళ్ళ కోసం తెర పడింది.

గడ్డ కట్టిన నెత్తుటి ముద్దల మీద నిశీథి నిద్రించినట్లు పోలేరమ్మ గుడిని చీకటి ఆవరించింది.

అలసిపోయిన గాలి, చెట్ల కొమ్మల్లో ఆకులపై విశ్రమించినట్లు సమీర్, సూరజ్‌లు చేసిన పరిశీలనల వివరాలు కాంతి రేఖల రూపంలో కాగితాల మడతలపై, యంత్రాల సృష్టి పేటికలో వున్నాయి.

వాటిని వెలికితీసి, పరిశీలిస్తే ఆ పవిత్ర రక్తం ద్రవించి, పొగలు స్రవించే రహస్యం తెలిసిపోతుంది. ఆ యువ శాస్త్రవేత్తలిద్దరూ చేస్తున్నదదే.

"ఆశ్చర్యం! అది మనిషి రక్తమే!"- సమీర్ అన్నాడు ఒక కాగితం మీది రేఖల్ని చూస్తూ.

"వ్వాట్!"- సూరజ్ తన చేతిలోని కాగితం మీద నుంచి చూపులు మరలించి అన్నాడు.

"అది మనిషి రక్తమే! సందేహం లేదు. ఈ స్పెక్ట్రోస్కోపిక్ ఎనాలసిస్ చూడు"- అని సమీర్ ఆ కాగితాన్ని సూరజ్‌కి అందించాడు.

సూరజ్ ఆ కాగితం మీది గీతల్ని నిశితంగా చూడసాగాడు.

స్థూల దృష్టికి అవి సామాన్యమైన గీతలు.

సూక్ష్మ పరిశీలనకి అవి కొన్ని యేళ్ళనాటి మనిషి రక్తపు వర్ణపటల రేఖలు.

"నలభై ఏళ్ళుగా అనుమాన ప్రదంగా వున్న ఒక సమస్యని పరిష్కరించాం. అది మనిషి రక్తమే అని తేలింది. కాని ఆ రక్తం చెందే మార్పులకి అసలు కారణం తేలలేదు"

ఈ పరిశోధనలో తాము సగం విజయమే సాధించామన్న అసంతృప్తి సూరజ్ మాటల్లో వ్యక్తం అయింది.

"సూరజ్! విశ్వాసానికి, విజ్ఞానానికీ సరిహద్దురేఖ చాలా సన్నితమైనది. రెండూ ప్రకృతి నియమాల ముందు మోకరిల్లేవే! ఒకటి తెలీక, మరొటి తెలిసి. పరిశోధనల వ్యాసార్థం విస్తృతం అయే కొద్దీ సత్య వృత్తం పరిధి పెరుగుతూంటుంది. లోకంలో యేదీ పూర్తి సత్యం కాదు. అర్థ సత్యమే."

సమీర్ అన్న మాటలు సూరజ్‌లో ఆలోచనని రేకెత్తించాయి.

"అర్థసత్యాలు పూర్తి సత్యాలుగా వెలుగు చూడనంతవరకూ ప్రకృతి పరిపూర్ణ స్వరూపం అర్థం కాదు. అంత వరకూ ఈ అన్వేషణలు సాగుతూనే వుంటాయి అలసట లేకుండా"- అనుకున్నాడు సూరజ్!

ఈ నిజాన్ని మరోసారి లోకానికి గుర్తు చేస్తూ సూర్యుడు పూర్వార్ధగోళంపై చీకటి తెర దించి, పశ్చిమార్థ గోళానికి వెలుగు పంట యివ్వాలని వెళ్ళిపోయాడు.

సగం చీకటి
సగం వెలుగు
సగం తెలిసిన నిజం
సగం తెలీని నిజం-
అంతా అర్ధ సత్యమే!